# పెళ్లిచూపులు

-ఘండికోట బ్రహ్మాజీరావు

నవంబరు ఒకటో తారీకు.

ఈశాన్య ఋతుపవనాలు ఉధృతంగా ఉన్నాయి.

ఉదయం నుండి చల్లని గాలి వీస్తున్నది. జల్లులు జల్లులుగా వాన కురుస్తున్నది.

రామారావు పదిగంటల కోచిలో విశాఖపట్నం నుండి పలాసా బయలుదేరాడు.

పెట్టెలో ఆట్టే మంది ప్రయాణికులు లేరు. బండి ప్రతి స్టేషనులోను ఆగుతుంది. వాన జల్లులు బెంచీలను తడిపేశాయి.

రామారావు కిటికీ దగ్గర కూర్చున్నాడు. అద్దం వేసుకున్నాడు. బెంచీ తుడుచుకున్నాడు. తెచ్చుకున్న వారపత్రిక చదవడానికి ప్రయత్నించాడు. కాని, సాధ్య పడలేదు. మనసు నిలకడగా లేదు.

కిటికీ అద్దంలోంచి అతను చూస్తున్నాడు. జల్లులు పెద్దవవుతున్నాయి. తెరలు తెరలుగా వస్తున్నాయి. బయట ఏమీ సరిగా కనిపించడంలేదు.

రామారావు ఉద్యోగంలో చేరి ఆరు నెలలయింది. ఇంటరు పాసయిన తరువాత పై చదువులు చెప్పించ డానికి తల్లిదండ్రులకు స్తోమత లేకపోయింది.

వాళ్లది చాలా పెద్ద కుటుంబం. తాతలు, తండ్రులు కలిసే ఉంటున్నారు. లంకంత పురాతనమైన ఇంట్లో అందరూ ఉంటున్నారు.

రామారావు తండ్రిగారు హైస్కూలులో గుమస్తాగా పనిచేస్తున్నారు. తాతగారు మరొక స్కూలులో హెడ్మా స్టరుగా రిటైరయ్యారు.

విజయనగరం మహారాజా వారి కళాశాలలో ఇం టరు పాసయిన వెంటనే అతనికి ఉద్యోగం దొరికింది. విశాఖపట్నం మునిసిపాలిటీలో సర్వేయరుగా చేరాడు. ఆరు నెలలు ప్రొబేషను ముగిసిన తరువాత పెర్మనెంటు ఖాళీలో అతనిని వేశారు.

పొద్దున్న టిఫిన్ తిని అతను బయలుదేరాడు. శ్రీకా కుళంలో వాళ్లమ్మగారు రైలెక్కుతారు. ఆవిడ మినపరొట్టె కాల్చి తెస్తారు.

రెండు రోజుల కింద ఒక పెద్దమనిషి వచ్చి, తన రెండో కూతురుని రామారావు కోసం చూసుకోమని తాతగారితో చెప్పారు. ఆ పని తన పెద్ద కోడలికి ఆయన విడిచిపెట్టారు. వెంటనే ఆమె విశాఖపట్నానికి కబురుపెట్టి కొడుకుని బయలుదేరమన్నారు.

జల్లులింకా ముమ్మరమయ్యాయి.

రామారావు తల్లిగారు రైలెక్కేసరికి బాగా తడిసి పోయారు. అతనికి బాగా ఆకలిగా ఉంది. రొట్టె తిం టుంటే రైలు ఉర్లాం బ్రిడ్జి దాటుతున్నది.

అప్పుడు సావకాశంగా రామారావు తల్లివేపు తిరిగి

## కోరికతోనే వచ్చాను

కోరికలే దుఃఖానికి
మూలకారణమని
బోధిసత్వుడు చెప్పగా విన్నాను
జీవి పుట్టుకలోనే కోరిక దాగుందా?
కోరిక నుండే జీవి పుట్టిందా?
తేలేదెన్నడు! తేల్చేదెవ్వడు!!

అయినా చేసేదేమీ లేక
నిలువెల్లా కోరికతోనే వచ్చాను.
చిన్నదో పెద్దదో / సాధ్యమో అసాధ్యమో
దురాశో అత్యాశో
కోరిక వినా జీవితం ఏముంది చెప్పు?
దేహాన్ని వల్మీకం చేసుకున్నాక
ఒకానొక వంకర టింకర విష సర్పమో
లేదంటే జీవితపు సున్నిత ప్రాంతాలలో సన్నగా
గీరే / పురుగో పుట్రో
అందులో వసించక తప్పదు కదా!

ఇప్పుడున్న స్థితిలో
ఆశ ఏదో / ఆకాంక్ష ఏదో
వివశ మోహం ఏదో / విడమరచి చెప్పలేను
విశదీకరించనూ లేను

చాకలి పద్దో
పచారీ సామాన్ల జాబితానో రాసుకున్నట్టు
కోరికల లిస్టు రాసుకోలేం గదా!

-శిఖామణి

అడిగాడు.

"ఇప్పుడు నా పెళ్లికి తొందరేమిటి?"

"నేనూ అలాగే మామగారి నడిగాను. పెద్దమనిషి వచ్చి అడిగితే అతని మాటకు విలువ ఇవ్వాలి. ఇంతకీ పెళ్లిచూపులివి. పెళ్లి చాలా దూరంలో ఉంది."

రామారావు మరేమీ మాట్లాడలేదు.

కోచి పళాసా చేరేసరికి మూడుగంటలయింది. వర్షం తగ్గింది. రామారావు బంధువులు స్టేషనుకు దగ్గరలోనే ఉన్నారు. వాళ్ల ఇంటికి వెళ్లి, బట్టలు మార్చుకొని కాఫీలు తాగేసరికి సాయంకాలం అయిదయింది.

పెళ్లికూతురి తండ్రి పేరు శంకరంగారు. ఆయన రైల్వేలో ఆఫీసరుగా ఉన్నారు. వారి బంగళా చాల పెద్దది. ఇంటినిండా నౌకర్లు, చాకర్లు.

పెళ్లిచూపులు హాలులో ఏర్పాటు చేశారు.

పెళ్లికూతురి తల్లి ఆప్యాయంగా రామారావు తల్లిని ఆహ్వానించారు. ఆమె పేరు పార్వతి.

శంకరంగారు రామారావు పక్కనే సోఫాలో కూర్చున్నారు. రామారావు ఇంటరు సర్టిఫికెటు చూసి ఆయన అన్నారు:

"నీకు ఫస్ట్ క్లాసు వచ్చిందే! ఇంజనీరింగులోనో, మెడిసిన్‌లోనో చేరలేకపోయావా?"

రామారావు నవ్వి ఊరుకున్నాడు.

అతనికి ఇంజనీరింగులో చేరాలని ఉండేది. కాని, కలిసిరాలేదు- తాతగారి దావా ఓడిపోయింది. ఉండే ఆస్తి అంతా తుడుచుకుపోయింది.

శంకరంగారు కవిత్వం వ్రాస్తారు. తను వ్రాసిన పద్యాలు రామారావుకి వినిపించారు. ధారాశుద్ధిగా వ్రాసిన పద్యాలవి. చాల బాగున్నాయి.

మరికొద్ది సేపటిలో పెళ్లి కూతుర్ని తెచ్చి కూర్చోబెట్టారు.

పిల్ల ఏకంగా తండ్రిలాగే ఉంది. కొట్టవచ్చిన అందమూ లేదు, అలా అని అనాకారి కూడా కాదు.

ఆ రోజుల్లో రామారావు గాంధీగారి సాహిత్యం చదివేవాడు. రూపం కన్న శీలం ముఖ్యమని అతను నమ్మేవాడు.

రామారావు తల్లి పెళ్లికూతురుని అడిగింది:

"నీ పేరేమిటి?"

"జానకి"

"ఏం చదువుకున్నావు?"

"పదో తరగతి పాసయాను."

"సంగీతం వచ్చా?"

"నేర్చుకుంటున్నాను."

"కుట్లు, అల్లికలు?"

"వచ్చు"

"వంట చెయ్యడం?"

అమ్మాయి నవ్వింది.

"వదినగారు! అన్ని పనులు వచ్చు. కిందటి సంవత్సరమే మా పెద్ద పిల్లకు పెళ్లిచేశాము- అది అత్తవారింటికి వెళ్లిన తరువాత మా జానకి వెనుక బడింది."

తరువాత శంకరం గారి భార్య కొన్ని నిజాలు వెల్లడి చేశారు.

"వదినగారు! నాకు పెద్ద సంబంధాల మీద ఆసక్తి లేదు. కుర్రాడు చదువుకొని, భార్యా భర్తలను పోషించుకునే స్థోమత ఉంటేచాలు. తరువాత తరువాత వాళ్లే పెద్దవాళ్లవుతారు."

రామారావు తల్లి ఏమీ అనలేదు.

తిరిగి పార్వతిగారు అన్నారు.

"పెళ్లి బాగా జరిపిస్తాం. ఏ విధమైన లోటు చేయం."

"ఏ సంగతి మీకు తెలియజేస్తాం" అన్నారు రామారావు తల్లి.

అందరూ లేచిపోతుంటే శంకరంగారు జేబులోంచి ఒక ఉత్తరం తీసి రామారావు చేతికిచ్చారు.

"ఇది మధ్యాహ్నం పోస్టులో వచ్చింది"

రామారావు ఉత్తరం చదివాడు.

"శంకరంగారు!

మీరు చూస్తే రైల్వే ఆఫీసరు- లాకాయి లూకాయి సంబంధం కోసం ప్రయత్నిస్తున్నారు. మీరెంత, ఈ రామారావుగాడెంత? వాడి ఉద్యోగమెంత? వియ్యం, కయ్యం సమాన స్థాయిలో ఉండాలి. ఈ సంబంధం మీకు సరిపడినది కాదు-

ఆకాశ రామన్న"

రామారావు ఉత్తరం చదివి నవ్వుతూ, దానిని శంకరం గారికి ఇచ్చి అన్నాడు:

"ఈ ఉత్తరంలో పచ్చి నిజం ఉంది. మా నాన్నగారు గుమస్తా. మా ఆస్తులన్నీ కోర్టు వ్యాజ్యాలలో పోయాయి. మా పాత ఇల్లు మా తాతలు కూడా పంచుకోలేదు. యథార్థం చెప్పాలంటే, నేను వేసుకున్న బ్లౌజరు కోటు మా స్నేహితుడిది. నేను తొడుక్కున్న షరాయి మా పినతండ్రిది. నా ఉద్యోగమూ మామూలుది. మా సంబంధం గురించి మరోసారి ఆలోచిస్తే మంచిది!" ■